క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు


దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

శంషాబాద్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపారులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం పట్టణంలోని చికెన్ దుకాణాలు, ఇతర వ్యాపార దుకాణాలు, పండ్ల విక్రయ కేంద్రాల్లో మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం అధికారి లక్ష్మయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. ఇందులో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న ఆయా దుకాణాలకు మొత్తం రూ. 9 వేల జరిమానా వసూలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మంచినీటి చెరువులో వ్యర్థాలు వేయొద్దు


హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో చెత్తను తొలగిస్తున్న దయానంద్

రాజేంద్రనగర్: చెరువులు, కుంటలు కాలువల్లో చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మందు సీసాలను పడేయడం దారుణమని సేవ్ ఎన్విరాల్‌మెంట్ ఆఫ్ వరల్డ్ అసోసియేషన్ డైరెక్టర్ కె.దయానంద్ అన్నారు. శుక్రవారం హిమాయత్‌సాగర్ పరివాహక ప్రాంతంలో చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మందు సీసాలు, చెత్త డంపింగ్ ఉండటంతో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన బృందంతో ఆయన వాటిని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తొలగించారు. అనంతరం బుద్వేల్ టీచర్స్ కాలనీలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ... నగరానికి మంచి నీటిని అందజేస్తున్న హిమాయత్ సాగర్‌లో చెత్త డంప్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వ్యర్థాలతో పాటు ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువులో పాడేయడం ద్వారా పర్యావరణానికి తీవ్ర ముంపు వాటిల్లుతుందన్నారు. మంచి నీటిని అందించే జలాశయంలోనే ఇలా ఉంటే కాలువలు, కుంటల పరిస్థితి ఏమిటన్నారు. చెత్తను డంప్ చేస్తున్న జలమండలి కానీ, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, శంషాబాద్ మున్సిపాల్టీ అధికారులు పట్టించుకోకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిని వెంటనే అరికట్టకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరించారు.

రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఖాయం

అత్తాపూర్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. నాంపల్లిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో శుక్రవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదర్‌గూడలో ఉమామహేశ్వరిరెడ్డి మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ రోజు రోజుకు బలమైన శక్తిగా మారుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు అందరి చూపు ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారం సాధించడం ఖాయమని అన్నారు.

సత్యనారాయణ ముదిరాజ్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న సత్యనారాయణముదిరాజ్

రాజేంద్రనగర్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఉజ్వల సంస్కృతిక, సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల మహోత్సవంలో రాజేంద్రనగర్‌కు చెందిన సంఘసేవకుడు డి.సత్యనారాయణ ముదిరాజ్‌ను ఘనంగా సన్మానించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ శుక్రవారం ఉదయం విలేకరులతో మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఉజ్వల సేవా సంస్థ ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకొని ప్రముఖులను సన్మానిస్తున్నారన్నారు. బోగ్గులకుంటలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను అందించారన్నారు. ఈ అవార్డుతో తనకు మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాల వారికి స్పష్టంగా తెలియజెప్పేలా రానున్న రోజుల్లో పలు కార్యక్రమాలు చేపడతానన్నారు.

వెంచర్లు.. ముంచేశాయి!

అధికారుల ఉదాసీనత.. ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం.. రియల్టర్ల బరితెగింపు.. ఈసీ వాగు పరీవాహక ప్రాంతానికి ముంపు ముప్పు తెచ్చిపెట్టింది. పెద్దల మేలు కోసం రైతుల పచ్చని పంట పొలాలను వరదకు ఆహుతి అయ్యేలా చేశారు. ముంపు సమస్యలపై 'సాక్షి' తన ప్రత్యేక కథనంతో ముందే హెచ్చరించినా అధికారుల్లో చలనం రాకపోవడం గమనార్హం. గడచిన మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో భారీ వరద రావడంతో గ్రామస్తులు, రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



మండలంలోని కేబీ దొడ్డి శివారు మల్కారం రెవెన్యూ భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌లో పారుతున్న వరద

ముంపుపై ముందే హెచ్చరించిన 'సాక్షి'
- ఈసీ వాగు పరీవాహక ప్రాంతంలో భారీ వెంచర్
- పంట పొలాల మునకతో రైతుల ఆందోళన
- వెంచరు ఏర్పాటుపై స్థానికుల ఆగ్రహం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండలంలోని కేబీ దొడ్డి శివారులో ఉన్న ఈసీ వాగును ఆనుకుని మల్కారం రెవెన్యూ భూములు ఉన్నాయి. ఈ భూముల్లో గత ఏడాది నుంచి రియల్టర్లు పనులు మొదలు పెట్టారు. ముందుగా భూముల్లో రోడ్ల కోసం భారీగా మట్టిని నింపారు. భూముల్లోకి వెళ్లడానికి రోడ్లు వేసుకుంటున్నామని వారు చేస్తున్న తప్పును సమర్థించుకున్నారు. ఇదే సమయంలో అధికారులు, నాయకులను మచ్చిక చేసుకుని అసలు పనికి పూనుకున్నారు.

వందల లారీల మట్టిని నింపి...

ఇక్కడి భూముల్లో వెయ్యికి పైగా భారీ లారీలతో మట్టిని తీసుకొచ్చి పూర్తిగా నింపేశారు. సుమారు 15 ఎకరాల్లో ఐదు అడుగులకు పైగా ఎత్తు పెంచేశారు. ఫాం ల్యాండ్ పేరుతో భూములను అధిక ధరలకు అమ్ముకునేందుకు వీలుగా పనులు చేపట్టారు. ముందుగా మొరం నింపి, పైన నల్ల మట్టి, ఆపై ఎర్ర మట్టిని పోసి పెద్ద పెద్ద చెట్లు నాటుతున్నారు. కొనుగోలుదారులకు ఇవేవి తెలియకుండా జాగ్రతగా మార్కెటింగ్ చేస్తున్నట్లు సమాచారం.

భారీ కట్ట ఏర్పాటు...

ఈసీ వాగుపై కేబీ దొడ్డి శివారులో ఉన్న కత్వ నుంచి వరద నీరు రెండుగా చీలి పారుతుంది. ఓ వైపు కాలువను అంచెమడుగుగా పిలుస్తారు. ఈ అంచెమడుగు కాలువను రియల్టర్లు పూడ్చి వేశారు. పైగా నీరు ఇటువైపు రాకండా భారీ ఎత్తును కట్టను ఏర్పాటు చేశారు.

◆ శంషాబాద్–మొయినాబాద్ రహదారిపై అంచెమడుగు మీద భారీ కల్వర్టు కూడా ఉంది. ఈ కల్వర్టు వద్ద కూడా భారీ గుంత తీసి నల్ల మట్టిని తరలించారు.

ఎన్‌ఓసీలతో చెలరేగిపోయారు...

పట్టా భూముల్లో పనులు చేసుకోవడానికి రియల్టర్లు సాగునీటి శాఖ నుంచి ఎన్‌ఓసీ సైతం తెచ్చుకున్నారు. ఎవరు అడ్డు చెప్పినా.. మాకు ఎన్‌ఓసీ ఉందంటూ దబాయించి మరీ పనులు చేస్తున్నారు. ఇక్కడ పంటలు సాగు చేయాల్సిన ప్రాంతంలో స్వార్థ ప్రయోజనాల కోసం భారీగా మట్టిని నింపి, వరద కాలువలను పూడ్చి వేస్తున్నా అధికారులకు పట్టడంలేదు. పైగా వరదకు అడ్డుగా ఆనకట్టలా ఏర్పాటు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు.

రైతుల గోస పట్టదా...

రియల్టర్లను కొమ్ముకాస్తున్నా అధికారులకు ఇక్కడి రైతులు, గ్రామస్తుల గోస పట్టడంలేదు. భారీగా మట్టిని నింపడంతో సమీప ప్రాంత రైతుల భూముల్లోకి వరద మట్టం పెరిగి తీవ్ర నష్టం కల్గుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగుకు ఓ వైపు ఉన్న కేబీ దొడ్డి ప్రాంతంలో మట్టిని నింపగా.. మరో పక్కన ఉన్న అమ్డాపూర్ రైతుల పొలాల్లో శుక్రవారం వచ్చిన వరద ప్రవాహం అమాంతం పెరిగింది. ఎప్పుడు లేనంతగా పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో పాటు కేబీ దొడ్డి గ్రామంలోని ఇళ్లకు నష్టం కల్గుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


సాక్షి
వానొస్తే మునకే...

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

రైతులకు తీవ్ర నష్టం



ఇక్కడి భూముల్లో వెంచర్ ఏర్పాటు చేసి భారీగా ఎత్తున మట్టిని నింపారు. దీంతో వరద ఇతర ప్రాంతం వైపు వెళ్లి రైతుల పొలాలను ముంచెత్తింది. పొలాల్లోని వరదనీరు బయటకు వెళ్లే మార్గం కూడా లేకుండా పోయింది. రైతులు సాగు చేసుకుని బతికేదెలా.

– విక్రమ్‌కుమార్, రైతు, కేబీ దొడ్డి

గ్రామానికి ముప్పు



అక్రమ వెంచర్‌తో చుట్టు పక్కల గ్రామాలకు ముంపు ముప్పు ఏర్పడుతుంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. భారీగా వరద వస్తే రహదారి సైతం కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. మా సమస్య ఎవరితో చెప్పుకోవాలో అర్థం కావడంలేదు.

– కశ్యప్, కేబీ దొడ్డి

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధిక ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి అవర్లీబేసిస్‌లో మొత్తం నియమించనున్నట్లు తెలిపారు. ఇందులో ఆంగ్లం, తెలుగు, వృక్షశాస్త్రం, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, వాణిజ్యం లెక్చరర్ల పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయి న్నారు. పీజీలో కనీసం యాభైఐదు శాతం మార్కులు కలిగి ఉండి, పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైన ఔత్సాహికులు ఈ నెల 23 సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తాత్కాలికంగా రహదారి మూసివేత

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ వరద గేట్లను తెరవడంతో రాజేంద్రనగర్ జనచైతన్య వెంచర్ నుంచి సన్‌సిటీకి వెళ్లే రహదారిని రాజేంద్రనగర్ పోలీసులు శుక్రవారం సాయంత్రం మూసివేశారు. ఈసీ కాలువ పై నుంచి ఈ ప్రాంతంలో స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. వరద గేట్లు ఎత్తడంతో ముందు జాగ్రత్తగా ఎలాంటి ప్రమాదం జరగకుండా రోడ్డును తాత్కలికంగా మూసివేసినట్లు ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. బారికేడ్‌లను ఏర్పాటు చేసి మూసి వేశామన్నారు. ఈ రహదారిని ఉపయోగించవద్దు అని ఈ సందర్భంగా స్థానికులకు సూచించారు. ప్రత్యామ్నాయ దారుల గూండా వెళ్లాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం


జగదీష్

శంషాబాద్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గగన్ పహాడ్‌లో నివాసముండే జోగు జగదీష్(31) జూన్ 10వ తేదీన డ్యూటీకి వెళుతున్నాని చెప్పి బైక్‌పై వెళ్లాడు. అంతకుముందు ఇంట్లో భార్యతో చిన్నపాటి గొడవపడ్డాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో పలుచోట్లు వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య రేవతి ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి


పాషా కాలనీ రోడ్డుపై కూలిన చెట్టు

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: లోతట్టు కాలనీలలో ఉన్న వారు, పందెన్‌వాగు పక్కనే ఉన్న వారు వర్షాలు పడేసమయంలో, వరదలు వచ్చేటప్పుడు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వర్షం కాస్త విరామం ఇవ్వటంతో ఆయన పంచవటి, శ్రీనివాస్‌నగర్ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సాధారణ వర్షపాతం కురిస్తే మున్సిపాలిటీ పరిధిలోని ఏ ఒక్క గృహానికీ ఇబ్బంది ఉండదన్నారు. ఒకే సారి పది సెంటీ మీటర్లకుపైగా వర్షం కురిస్తే పలు కాలనీల్లోకి వరద నీరు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి సమయంలో ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు. పాషా కాలనీలో రోడ్డుపై ఓ చెట్టు కూలిపోగా దాన్ని మున్సిపల్ సిబ్బంది తొలగించారు.


పందెన్‌వాగు పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్న వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

స్క్రాప్ దుకాణాలే లక్ష్యంగా చోరీలు

- నలుగురి అరెస్టు
- రూ. 3 లక్షల సామగ్రి స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు

రాజేంద్రనగర్: స్క్రాప్ దుకాణాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ ముఠాను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా నలుగురు అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కారుతో పాటు 35 బ్యాటరీలు, 40 కిలోల కాపర్ వైర్, 20 కిలోల ఐరన్, 60 కిలోల స్క్రాబ్, కట్టర్ మిషిన్‌తో పాటు స్క్రాప్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం రూ. 3 లక్షలు ఉంటుందని ఇన్‌స్పెక్టర్ మధు వెల్లడించారు. కామటిపుర ప్రాంతానికి చెందిన గౌస్ ఖాన్(19) పాత నిందితుడు. గతంలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో జరిగిన స్క్రాప్ దొంగతనాల్లో నిందితుడు. చంద్రాయణగుట్ట హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అలీ అహ్మద్(24), సమీర్(22), ఇర్ఫాన్ అహ్మద్(23), గౌస్‌ఖాన్(19)తో కలిసి ముఠాగా ఏర్పడ్డాడు. శంషాబాద్, చంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, బహదూర్‌పురా పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ ముఠా దాదాపు 10 దుకాణాలకు పాల్పడ్డారు. మైలార్‌దేవ్‌పల్లిలో జరిగిన ఆరు దొంగతనాల కేసులపై దర్యాప్తు చేసిన పోలీసులు పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం మహ్మద్ అలీ అహ్మద్, సమీర్, ఇర్ఫాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి దాదాపు రూ. 3 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు గౌస్‌ఖాన్ పరారీలో ఉన్నాడని.. త్వరలో పట్టుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


అరెస్టు చేసిన నిందితులతో పోలీసులు

ఈసీ, మూసీ పరీవాహక ప్రాంతాల్లో పారాహుషార్



బండ్లగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా హిమాయత్‌సాగర్‌కు వరద ప్రవాహం ఎక్కువ అవుతుంది. దీంతో శుక్రవారం వరద గేట్లను ఎత్తడం జరిగిందన్నారు. ఈసీ పరీవాహక ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ సురక్షిత ప్రాంతాలకు పంపిస్తున్నారన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో తక్షణ సహాయం కోసం ఫోన్: 91211 06519లో సంప్రదించాలని కోరారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని సూచించారు.

ముంపు ప్రాంతాల్లో డీసీ పర్యటన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ముంపు ప్రాంతాలతో పాటు వరద నీరు నిలిచిన రహదారులను జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్, ఏఎంహెచ్‌వో ఆంజనేయులు శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షించారు. సిబ్బంది, అధికారులకు సూచనలు, సలహాలు అందించడంతో పాటు అదనంగా సిబ్బందిని నీటిని తోడే మోటర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్‌కు వెళ్లే దారి, శాస్త్రీపురం వెళ్లే దారి వరద నీరు నిలిచిపోయాయి. అలాగే మీరాలం చెరువు పక్కనే ఉన్న హసన్‌నగర్‌తో పాటు పక్కనే ఉన్న బస్తీలలోకి గురువారం అర్ధరాత్రి వరద నీరు చేరింది. దీంతో సిబ్బంది హుటాహుటిన ఆయా ప్రాంతాలకు చేరుకొని మోటార్ల ద్వారా నీటిని పంప్ చేశారు. ఈ ప్రాంతాలను పర్యటించిన అధికారులు ఆయా ప్రాంతాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. రాజేంద్రనగర్, బెస్ట్‌ప్రైజ్, శివరాంపల్లి, ఉప్పర్‌పల్లి, డీమార్ట్ ప్రాంతాలలో వరద నీరు నిలిచిపోవడంతో వాటిని మోటర్ల ద్వారా తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పనులను చేపట్టారు.


కూలిన ఏసీపీ కార్యాలయ ఆవరణలోని చెట్టు

కూలిన చెట్టు...

రాజేంద్రనగర్‌లోని రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ కార్యాలయ ఆవరణలో ఉన్న చెట్టు మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి శుక్రవారం నెలకొరిగింది. ఈ సమయంలో చెట్టు వద్ద ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. వెంటనే స్పందించిన పోలీసులు విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం అందించారు. స్టేషన్‌కు అడ్డంగా చెట్టుపడిపోవడంతో వెంటనే తొలగించారు.


ఆరాంఘర్ నుంచి జూపార్క్‌కు వెళ్లే రోడ్డుపై నిలిచిన వరద నీటి పనులను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్

చారిత్రక భవనాలను సంరక్షించాలి

- ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీ సులేమాన్ సిద్దిఖి

రాయదుర్గం: చారిత్రక భవనాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో ప్రొఫెసర్ సాదిక్ నఖ్వీ స్మారక ఉపన్యాసం 'యాన్ అవుట్‌లైన్ హిస్టరీ ఆఫ్ సోఫియో, కల్చరల్ అండ్ మిస్టిక్‌లైఫ్ ఇన్ ద దక్కన్' అనే అంశంపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగల పౌరులుగా సమాజం సంస్కృతి యొక్క ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. వారసత్వం, సంస్కృతి సారధులుగా వ్యవహరించాలన్నారు. మధ్యయుగ కాలంలోని ఇంజనీరింగ్ అద్భుతాలను మనం సంరక్షించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని, నేటి తరానికి స్మారక చిహ్నాలని అన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ దీపక్‌కుమార్, యూనివర్సిటీ లేబ్రేరియన్ డాక్టర్ అక్తర్ పర్వేజ్, మీర్ ఫిరాసత్‌అలీ ఖుస్రో, అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ ఫైసల్ ముస్తఫా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉస్మానియాయూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ


హిమాయత్‌సాగర్ గేట్లను ఎత్తుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జలమండలి అధికారులు

ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోండి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

మణికొండ: భారీ వర్షాలు ఆదివారం వరకు కురిసే అవకాశం ఉన్నందున వచ్చే వరదల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆమె మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చెరువు, స్పెక్ట్రమ్ విల్లాస్, ఈవీవీ కాలనీ, పంచవటి కాలనీలలో పందెన్‌వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పందెన్‌వాగు రిటర్నింగ్ వాల్ పనులను అడిగి తెలుసుకున్నారు. వాగులో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాలని, నీటిని సాఫీగా వెళ్లిపోయేలా ఎక్కడికక్కడ చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో డిజాస్టర్ టీం పనితీరు, వాగు వెంట, మ్యాన్‌హోల్‌ల వద్ద, రోడ్లపై తీసుకుంటున్న చర్యలను ఆమెకు మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ పద్మారావు, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, టీపీఓ రాకేష్, కాలనీల వాసులు పాల్గొన్నారు.


పందెన్‌వాగు పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు